TELANGANA CAPITAL

# తెలంగాణ క్యాపిటల్

నిజం.. నిజాయితీ.. నిబద్ధత

TELANGANA CAPITAL NEWS

www.telanganacapitalnews.com

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 120 | మంగళవారం, సెప్టెంబర్ 3, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

## రేవంత్‌కు...


# సుప్రీం నోటీసులు



**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టులపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొంది. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాంగ్రెస్ ప్రశ్నిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చిన సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా పోస్టులపై సుప్రీంకోర్టు వివరణ అడిగింది. కవిత బెయిల్ అంశంపై సోషల్ మీడియా పోస్టులను సీరియస్‌గా తీసుకుంది. కవితకు బెయిల్ వచ్చిందా? ఇచ్చారా? అంటూ తెలంగాణ కాంగ్రెస్ పోస్ట్ చేసింది. కమలంతో స్నేహం... కవితక్కకు మోక్షం అంటూ పేర్కొంది. తెలంగాణ కాంగ్రెస్ పోస్టులపై వివరణ ఇవ్వాలంటూ పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఆయనకు రెండు వారాల గడువును ఇచ్చింది.

## 4, 5 తేదీల్లో ప్రధాని మోడీ...


# సింగపూర్ పర్యటన



**న్యూఢిల్లీ:** భారత్, సింగపూర్ మంత్రుల రౌండ్‌టేబుల్ వ్యవస్థ కింద గుర్తించిన భాగస్వామ్యం కొత్త అంశాలపై ముందుకు సాగుతూ రెండు దేశాలు మరింత పురోగతి సాధించనున్నాయని విదేశాంగ మంత్రిత్వశాఖ (ఎంఇఎ) సోమవారం సూచించింది. ప్రధాని నరేంద్ర మోడీ సింగపూర్‌లో జరపనున్న పర్యటనకు ముందు ఎంఇఎ ఆ వ్యాఖ్యలు చేసింది. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ ఆహ్వానంపై ప్రధాని మోడీ బుధ, గురువారాల్లో (4, 5 తేదీల్లో) ఆ దేశాన్ని సందర్శించనున్నారు. సింగపూర్ సందర్శనకు ముందు ప్రధాని మోడీ మంగళ, బుధవారాల్లో బ్రూనైలో పర్యటించనున్నారు. ఎంఇఎ కార్యదర్శి (తూర్పు) జైదీప్ మజుందార్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, 'రక్షణ రంగంలో సంయుక్త వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు దిశగా భారత్, బ్రూనై సాగుతున్నట్లు తెలియజేశారు. కాగా, సుమారు ఆరు సంవత్సరాల తరువాత ప్రధాని మోడీ సింగపూర్‌ను సందర్శిస్తున్నారని ఆయన తెలిపారు. 'సింగపూర్‌లో కొత్త అధినేత బాధ్యతలు స్వీకరించిన సమయంలో ఈ పర్యటన చోటు చేసుకుంటున్నది. చైతన్యవంతమైన మన ద్వైపాక్షిక సంబంధాల తదుపరి దశకు వేదిక ఏర్పాటుకు ఇదే అనువైన సమయం' అని మజుందార్ పేర్కొన్నారు.

## నిండా మునిగారు...

# రైతన్నలను ఆదుకోండి



హైదరాబాద్ : వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి పదివేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్విట్ చేశారు. ప్రజలు కష్టాల్లో ఉన్నారు సహాయక చర్యల కోసం ఆర్తిగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇంట్లో వరద నీరు, కంట్లో ఎడతెగని కన్నీరు.. వరద సృష్టించిన విలయాన్ని చూస్తుంటే గుండె తరుక్కుపోతుందని హరీష్ రావు ఎమోషనల్ ట్వీట్ చేశారు. ప్రభుత్వం కొంతకాలం శుష్క రాజకీయాలు,కూల్చివేతలను ఆపి బాధితులను ఆదుకోవడంపై సంపూర్ణంగా దృష్టి కేంద్రీకరించాలని కోరారు.

# వైఎస్సార్‌కు సీఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వైఎస్సార్ కు నివాళు లర్పించారు. జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో వైఎస్సార్ చిత్రపటానికి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. 'పేదల హృదయాల్లో... తడి ఆరని సంక్షేమ సంతకం... తెలుగు ప్రజల మనసుల్లో... అభిమానపు ప్రతిరూపం' అంటూ వైఎస్సార్ ను స్మరించుకుంటూ సీఎం ట్వీట్ చేశారు.**



## మృతుల కుటుంబాలకు....

# రూ.5 లక్షల ఆర్థిక సాయం

హైదరాబాద్: భారీ వర్షాలకు ఖమ్మం జిల్లా అతలాకుతలమైంది. ఈ నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సిఎం రేవంత్ రెడ్డి పర్యటించేందుకు రోడ్డు మార్గం ద్వారా ఖమ్మం బయల్దేరి వెళ్లారు. అంతకుముందు వర్షాలపై ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. వరద ప్రభావిత జిల్లాలు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట కలెక్టర్లలకు తక్షణ సాయం కోసం 5 కోట్లు మంజూరు చేశారు. వరదల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు 5 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ప్రజలకు జరిగిన నష్టంపై అధికారులు స్పందించాలని... వర్షాలతో జరిగిన నష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను సిఎం ఆదేశించారు. "భారీ వర్షాలు ఉన్న చోట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. జిల్లాలోని కలెక్టరేట్‌లలో కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలి. కమాండ్ కంట్రోల్ సెంటర్ వ్యవస్థ సన్నద్ధంగా ఉండాలి. 8 పోలీస్ బెటాలియన్లకు ఎన్డీఆర్ఎఫ్ తరహా శిక్షణ ఇవ్వాలి" చెప్పారు.

అలాగే, జాతీయ విపత్తుగా పరిగణించి తక్షణమే సాయం అంధించాలని కేంద్రానికి సిఎం రేవంత్ లేఖ రాశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మోడీ పర్యటించాలని కోరారు.



# టీవీ9ని బ్యాన్ చేసిన మమతా బెనర్జీ

కోలకతా: పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారం, హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. అయితే.. ఈ ఘటనపై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మమత బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి పార్టీ పలు మీడియా సంస్థలపై బాయ్ కాట్ చేసింది. బెంగాల్‌పై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారంటూ.. మూడు ఛానెళ్లు TV9, ABP ఆనంద, రిపబ్లిక్ లను బహిష్కరిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ఛానళ్లకు అధికార ప్రతినిధులను పంపొద్దని అధికార పార్టీ టిఎంసి నిర్ణయించుకుంది. ఆయా ఛానళ్ల ప్రమోటర్లపై దర్యాప్తులు, ఈడీ కేసులు, ఢిల్లీ జమీందార్లను సంతోషపెట్టాల్సిన అవసరాన్ని గుర్తించామని తెలిపింది. కాగా.. డాక్టర్ అత్యాచారం, హత్య కేసు సీబిఐ దర్యాప్తు చేస్తోంది. ఇప్పటికే ప్రధాన నిందితుడితోపాటు మరో ఐదుగురిని విచారించిన సిబిఐ అధికారులు.. వారికి లై డిటెక్టర్ టెస్టు కూడా నిర్వహించారు. ఓ వైపు దర్యాప్తు జరుగుతున్నా.. మరోవైపు వైద్యులు ఆందోళన కొనసాగిస్తున్నారు.



## భారీ వర్షాలకు తెలంగాణలో..

# రూ.5438 కోట్ల నష్టం

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రాథమికంగా వేసిన అంచనా ప్రకారం రూ.5438 కోట్లు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ప్రకటించింది. ఆర్ అండ్‌బి శాఖకు రూ.2362 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.175 కోట్లు, వ్యవసాయ పంట నష్టం రూ.415 కోట్లు, ఇరిగేషన్ శాఖకు రూ.629 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ.170 కోట్లు, వైద్య ఆరోగ్యశాఖకు రూ.12 కోట్లు, పశు సంవర్ధక శాఖకు రూ.25 కోట్లు, పురపాలక శాఖకు రూ.1150 కోట్లు, ఇతర శాఖలు, ప్రజల ఆస్తుల నష్టం రూ.500 కోట్లుగా ప్రాథమికంగా అంచనా వేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## ఇళ్ల నుంచి బయటకు రావొద్దు..

# హైదరాబాద్ వాసులకు జీహెచ్ఎంసి అలర్ట్

**హైదరాబాద్:** భారీ వర్షాలు కురుస్తుండటంతో హైదరాబాద్ నగర వాసులకు జీహెచ్ఎంసి అధికారులు అలర్ట్ జారీ చేశారు. బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో హైదరాబాద్ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని.. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దని జీహెచ్ఎంసి అలర్ట్ మెసేజులు పంపుతోంది. నాలాలు, చెరువులు, లోతట్టు ప్రాంతాల వద్దకు వెళ్లొద్దని నగరవాసులను హెచ్చరించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం సచివాలయంలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేసింది. ఎమర్జెన్సీ ఉంటటే 040 21111111, 9000113667కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించింది. కాగా, రాష్ట్రంలో ఇవాళ, రేపు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాక వెల్లడించిన సంగతి తెలిసిందే.

### మరో 4 రోజులు అతి భారీ వర్షాలు..

తెలంగాణలో మరో నాలుగు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాక ప్రకటించింది. ఇవాళ రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం తెలిపింది. రానున్న 12 గంటల్లో బంగాళఖాతంలో వాయుగుండం బలహీనపడనున్నట్లు తెలిపింది. దీంతో రేపు నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో పాటు 40-50Kmph వేగంతో ఈదురుగాలులు వీస్తాయని రెడ్ అలర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. మరోవైపు, హైదరాబాద్ లో వర్షం



మళ్లీ మొదలైంది. నగరంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసఫ్ గూడ, బోరబండ, అల్లాపూర్, యూసఫ్‌నగర్ తదితర ప్రాంతాల్లో వాన పడుతోంది. రాష్ట్రంలోని జిల్లాల్లో నిన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తోంది.

# బాబోయ్.. భోజనంలో కోడి ఈక...



**నిజామాబాద్:** నిజామాబాద్‌లో రెస్టారెంట్ల పరిస్థితి దారుణంగా మారింది. హెూటల్ భోజనంలో కోడి ఈక వచ్చిన ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివిధ పనులపై నందిపేట నుంచి నిజామాబాద్‌కు వచ్చిన ఓ వ్యక్తి నగరంలోని పూలాంగ్ ప్రాంతంలో బిర్యానీ దర్బారార్‌లో భోజనం చేసేందుకు వెళ్లాడు. సదరు వ్యక్తి బిర్యానీ ఆర్డర్ చేయగా.. హెూటల్ యాజమాన్యం తీసుకొచ్చిన ఆహారాన్ని ఆ వ్యక్తి తింటున్న సమయంలో బిర్యానీలో దుర్వాసన రావడమే కాకుండా కోడి ఈక కూడా కనిపించడంతో ఆ వ్యక్తి ఆశ్చర్యానికి గురయ్యాడు. ఈ విషయంపై హెూటల్ మేనేజర్ ని నిలదీయగా... పొంతనలేని సమాధానం ఇచ్చారు. దీంతో సదరు వ్యక్తి కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన కార్పొరేషన్ అధికారులు బిర్యానీ దర్బార్ లో ఆహారాన్ని పరిశీలించి తనిఖీలు నిర్వహించారు. భోజనంలో కోడి ఈక ఉందని నిర్ధారించుకుని బిర్యానీ దర్బార్ హెూటల్‌పై రూ.5 వేలు జరిమానా విధించారు కార్పొరేషన్ అధికారులు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో ఉంచాలని కార్పొరేషన్ అధికారులు హెచ్చరించారు.

# ఆ ఇళ్లను కూల్చివేయండి... నోటీసులు




**నిజామాబాద్ :** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన పాత ఇండ్లు వర్షానికి కూలుతున్నాయి. సోమవారం పెద్దబజార్ లో హనుమాన్ ఆలయం ఎదురుగా ఒక్కసారిగా ఇల్లు కుప్ప కూలింది. పక్కనే దుకాణం.. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఉదయం ఇల్లు కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అదేవిధంగా పెద్ద బజారులోని కూలిపోయే దశలో ఉన్న మరో ఇల్లును కూడా గుర్తించి అధికారులు నోటీసులు అతికించారు.

**కూలిపోయే దశలో ఉన్న ఇండ్లలో నివశించొద్దు..**
**గత మూడు రోజులుగా 35 ఇండ్లకు కార్పొరేషన్ నోటీసులు..**

కూలిపోయే దశలో ఉన్న ఇండ్లలో ఎట్టి పరిస్థితుల్లో నివశించొద్దని కార్పొరేషన్ అధికారులు సూచిస్తున్నారు. పెద్ద ప్రమాదం జరగకముందే ముందస్తు జాగ్రత్తగా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో కూలిపోయే దశలో ఉన్న ఇండ్లను అధికారులు గుర్తిస్తున్నారు.

# ఇండియాకు బంగ్లాదేశ్ అల్టిమేటం!




ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను అసలు అప్పగించే ఉద్దేశం ఉందా, లేదా? అని బంగ్లాదేశ్, భారత్ కు అల్టిమేటం ఇచ్చింది. మీడియా వర్గాల ప్రకారం బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల సలహాదారు ఎండీ తౌహిద్ హుసైన్ మీడియాతో మాట్లాడుతూ హసీనాను బంగ్లాదేశ్ కు రప్పించేందుకు యూనస్ ప్రభుత్వం ఏమైనా చేస్తుందని భరోసా ఇచ్చారు. భారత్ కు ఎన్నిసార్లు చెప్పినా అప్పగించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం తలచుకుంటే ఎలాగైనా హసీనాను తీసుకురాగలదన్నారు. అసలు హసీనా భారత్ లో ఎక్కడుండో బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వానికి తెలుసా? అని మీడియా ప్రశ్నించినప్పుడు "ఆ విషయం భారత్ నే అడగండి" అంటూ తౌహిద్ హుసైన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్ లో చెలరేగిన విద్యార్థుల నిరసన హద్దులు మీరడంతో హసీనా ప్రాణ భయంతో ఇండియాలో ఆశ్రయం పొందింది. బంగ్లాదేశ్ హసీనా, ఆమె బంధువుల దౌత్య పాస్ పోర్ట్ లను రద్దు చేసింది. హసీనాకు భారత్ ఆశ్రయం కొనసాగిస్తే రెండు దేశాల మధ్య భవిష్యత్ సంబంధాలు దెబ్బతింటాయని కూడా బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఫఖ్రుల్ ఇస్లాం ఆలంగీర్ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

## ఆప్ ఎంఎల్ఏ అమానతుల్లాఖాన్ ఇంటిపై

# ఈడి దాడి



న్యూ ఢిల్లీ: ఢిల్లీ వక్ఫ్ బోర్డ్ అక్రమాలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంఎల్ఏ అమానతుల్లా ఖాన్ నివాసంపై ఈడి ఈ ఉదయం దాడి చేసింది. ఎంఎల్ఏ ఇంట్లో ఈడి సోదాలు నిర్వహిస్తుంటే ఆయన ఇంటి బయట పోలీసులు, పారామిలటరీ బలగాలు పెద్ద ఎత్తున మోహరించాయి. అమానతుల్లాఖాన్ తన ఎక్స్ ఖాతాలో ఈ విషయాన్ని చెబుతూ తనను అరెస్ట్ చేసేందుకు ఇప్పుడే ఈడి అధికారులు తన ఇంటికి వచ్చారని పేర్కొన్నారు. అమానతుల్లా ఇంటిపై ఈడి సోదాలను ఆప్ తీవ్రంగా ఖండించింది. బిజేపి చేతిలో అస్త్రంగా మారిపోయిన ఈడి ఢిల్లీ వాతావరణాన్ని కలుషితం చేస్తోందని మండిపడింది. బిజేపికి వ్యతిరేకంగా మాట్లాడే గొంతులను ఈడి అణచివేస్తోందని ఆప్ సీనియర్ నేత మనీశ్ సిసోడియా విమర్శించారు. తమకు లొంగని వారిని ఈడి కటకటాల వెనక్కి పంపిస్తోందని ఆరోపించారు. ఆప్ ఎంపి సంజయ్ సింగ్ మాట్లాడుతూ, అమానతుల్లాఖాన్‌కు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాలు లేకున్నా ప్రధాని మోడీ నియంతృత్వం, ఈడి గూండాయిజం కొనసాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆప్ నేతల విమర్శలపై బిజెపి ఢిల్లీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ్ మాట్లాడుతూ, అమానతుల్లాఖాన్ నివాసంపై ఈడి సోదాలను సమర్థించారు. ఆప్‌లో అవినీతి నేతల గ్రూపు ఒకటుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారిపై చట్టం తనపని తాను చేస్తుంటే వారు అరవడం మొదలుపెడతారని విమర్శించారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డులో అక్రమాలకు పాల్పడిన అమానతుల్లాఖాన్ ఈడి చర్యలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్రమాలకు పాల్పడితే సమాధానం చెప్పాల్సిందేనని, చట్టానికి ప్రతి ఒక్కరూ సమానమేనని అన్నారు.

# మాట నిలుపుకున్న రాహుల్ గాంధీ

కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నయాకుడు రాహుల్ గాంధీ నుంచి సుల్తాన్‌పూర్ చర్మకారుడు రాం చేత్ సోమవారం చెప్పుల తయారీకి సంబంధించిన ముడి పదార్థాలను అందుకున్నారు. జులై 26న రాహుల్ గాంధీ సందర్శనతో దేశవ్యాప్తంగా చాం చేత్ పేరు మార్మోగింది. పరవునష్టం కేసులో సుల్తాన్‌పూర్ కోర్టుకు హాజరై లక్నోకు తిరిగివెళుతూ రోడ్డు పక్కన ఉన్న రాం చేత్ చెప్పుల దుకాణాన్ని రాహుల్ గాంధీ సందర్శించి అతని మంచిచెడ్డలను వాకబు చేశారు. అతని జీవనస్థితిగతులను మారుస్తానని రాహుల్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం తర్వాత చెప్పుకు కుట్టేందుకు ఉపయోగపడే కుట్టు మిషన్‌ను అందచేసిన రాహుల్ ఇప్పుడు తాజాగా చెప్పుల తయారీకి సంబంధించిన ముడి సరుకును పంపించారు. రాహుల్ పంపించిన చర్మ పదార్థాలతో స్త్రీ, పురుషుల కోసం షూస్ తయారుచేస్తానని రా చేత్ తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్‌కు అతను కృతజ్ఞతలు తెలియచేశాడు.



# బాధితులకు అండగా ఉంటాం

## - ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ఖమ్మం:** వరదలు, వర్షాలతో తెలంగాణ ప్రజలు ఇక్కట్లు పడుతుంటే సహాయక కార్యక్రమాలకు దూరంగా ఉంటూ ట్విట్టర్, సోషల్ మీడియాలకే కేటీఆర్, హరీష్ రావులు పరిమితమయ్యారని విమర్శించారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. ఖమ్మం, మధిర ప్రాంతాల్లోని వరద ప్రాంతాలను ఆయన పర్యటించారు.. బాధితులను పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతూ... వరదలు రాగానే ప్రజల్లోనే వున్నామని, సహాయ చర్యలను అందించామన్నారు. రెస్క్యూ ఆపరేషన్ లో ప్రభుత్వం కీలకంగా పనిచేసిందని, గతంలో చిన్న వర్షం వస్తే హైదరాబాద్ లో బీఆర్ఎస్ చేతులు ఎత్తేసే వారని ఆయన అన్నారు. ఇప్పుడు హైదరబాద్ ను అద్భుతంగా తయారు చేస్తున్నామని, నష్టాన్ని అంచనా వేస్తున్నామన్నారు. ప్రజల వద్దకు వస్తే ప్రజలు తిరగబడతారని అదే సోషల్ మీడియాలో అయితే ఏదైనా చెప్పే అవకాశం ఉండటంతో వారు సోషల్ మీడియాకే పరిమితం అయ్యారని విమర్శించారు. అధికారులు కూడా మనుషులే అని రేయింబవళ్లు శ్రమిస్తున్నారన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషికి అభినందిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను మర్చిపోయారని, తమది గడీల పాలన కాదని, మేము గడీలకు పరిమితం కాలేదన్నారు భట్టి.

## సహాయ కార్యక్రమాల్లో పాల్గొనండి...

# బీజేపీ శ్రేణులకు ఎంపీ అరవింద్ పిలుపు



**నిజామాబాద్ :** జిల్లాలో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలపై నిజామాబాద్ అండ్ జగిత్యాల జిల్లాల కలెక్టర్లకు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి లేఖ రాశారు. లేఖలో జిల్లాలో ఇప్పటికే పలుచోట్ల రోడ్లు తెగిపోయి రాకపోకలకు అంతరాయం కలుగుతుందని, మరో రెండు మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ ఆర్ అండ్ బీ, పోలీస్, విద్యుత్, ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి యుద్ధ ప్రాతి పదికన సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఎక్కడ కూడా ప్రాణ నష్టం జరగకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా 40గేట్లు తెరిచినందున మత్స్యకారులు, జాలర్లను అప్రమత్తం చేయాలని, నిరాశ్రయులైన లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి కనీస సౌకర్యాలు అందజేయాలని కోరారు. మరోవైపు ప్రజలంతా కూడా జాగ్రత్తగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయట తిరగవద్దని ఆయన కోరారు. వ్యవసాయ మోటర్ల వద్ద రైతులు జాగ్రత్తగా ఉండాలని, గోదావరి పరీవాహక గ్రామాల మత్స్యకారులు, జాలర్లు చేపల వేటకు వెళ్లకుండా ఉండాలని, ఎక్కడైనా ఇబ్బందులుంటే భారతీయ జనతా పార్టీ శ్రేణులు సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

# కుల గణాంకాల వినతిని తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: వెనుకబడిన, ఇతర అణగారిన వర్గాల సంక్షేమం కోసం సామాజిక-ఆర్థిక కుల గణనను నిర్వహించాలని కేంద్రాన్ని ఆదేశించమని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఈ సమస్య పాలన పరిధిలోకి వస్తుందని పేర్కొంది. జస్టిస్ హృషికేష్ రాయ్, ఎస్‌వీఎన్. భట్టిలతో కూడిన ధర్మాసనం... పిటిషనర్ పి. ప్రసాద్ నాయుడు తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతించింది. అతను జనాభా గణన కోసం డేటా గణనను వేగవంతం చేయాలని కోరుతూ పిటిషన్ వేశాడు. కానీ విచారణకు ధర్మాసనం నిరాకరించడంతో ఉపసంహరించుకున్నాడు.

"దీనిపై ఏమి చేయవచ్చు? సమస్య పాలన పరిధిలో ఉంది. ఇది విధానపరమైన అంశం" అని- పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది రవిశంకర్ జంద్యాల , న్యాయవాది శ్రవణ్ కుమార్ కరణమ్‌లకు ధర్మాసనం తెలిపింది. అనేక దేశాలు కుల గణన చేశాయని, కానీ భారత్ ఇంకా చేయలేదని జంధ్యాల ఆవేదన వ్యక్తం చేశారు. "1992 నాటి ఇంద్ర సాహ్నీ తీర్పు (మండల్ కమిషన్ తీర్పు) ఈ కుల జనాభా గణనను కాలానుగుణంగా నిర్వహించాలని పేర్కొంది," అని ఆయన వాదించారు. ఈ విషయంలో కోర్టు జోక్యం చేసుకోజాలదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. కోర్టు మూడ్‌ని పసిగట్టిన న్యాయవాది, బెంచ్ అనుమతించని పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరారు. కరణం ద్వారా దాఖలు చేసిన తన పిటిషన్‌లో నాయుడు కేంద్రం , దాని ఏజెన్సీలు ఇప్పటి వరకు జనాభా లెక్కలు-2021 కోసం గణనను నిర్వహించలేదని అన్నారు. జనాభా గణన కేవలం జనాభా వృద్ధి తెలుసుకోడానికి కాదని, ఇది విధాన రూపకల్పన, ఆర్థిక ప్రణాళిక , వివిధ పరిపాలనా ప్రయోజనాల కోసం పనికొస్తుందని, దేశ ప్రజల సమగ్ర సామాజిక-ఆర్థిక డేటాను కూడా అందిస్తుందని పేర్కొన్నారు. సామాజిక-ఆర్థిక కుల గణన వెనుకబడిన వర్గాలను గుర్తించడానికి, సమాన వనరుల పంపిణీని నిర్ధారించడానికి ,లక్ష్య విధానాల అమలును పర్యవేక్షించడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు.

"1931లో కులాల వారీగా జరిగిన గణాంకం డేటా చాలా పాతది. జనాభా గణన, సామాజిక-ఆర్థిక కుల గణన నుండి ఖచ్చితమైన డేటా సామాజిక న్యాయం, రాజ్యాంగ లక్ష్యాలను సాధించడానికి కేంద్ర ప్రభుత్వానికి కీలకమైనది. స్వాతంత్ర్యం తర్వాత మొదటిసారిగా 2011లో నిర్వహించిన SECC కుల సమాచారంతో సహా సామాజిక-ఆర్థిక సూచికలపై సమగ్ర డేటాను సేకరించడం లక్ష్యంగా పెట్టుకుంది" అని వినతి పేర్కొంది.

తెలంగాణ క్యాపిటల్

# సంపాదకీయం

మంగళవారం, సెప్టెంబర్ 3, 2024

## విద్యావిధానం ఇలా ఉంటే..

ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే ఉన్నత చదువులు చదువుకున్న నేను గత రెండు దశాబ్దాలుగా వివిధ ప్రయివేటు విద్యాసంస్థల్లో గణిత ఉపాధ్యాయుడిగా, భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా, అప్పుల తాకిడితో విపరీతమైన ఆర్థిక సమస్యలను చూసిన విద్యాసంస్థల నిర్వాహకుల్లో ఒకడిగా ఉంటున్నాను. అన్నింటికీ మించి విద్యారంగ ప్రేమికుడిగా నాకు విద్యతో విడదీయరాని సంబంధం, విడదీయలేని అనుబంధం వుంది. పాఠాలు బోధించిన అనుభవంతో నేటి విద్యావ్యవస్థలోని మార్పులపై నేను కొన్ని నా ఆలోచనలను బాధ్యతతో మీకు విన్నవిస్తున్నాను. ఈ రోజు విద్య కొంతమంది స్వార్థం, కొన్ని రాజకీయ కారణాల వల్ల వ్యాపారంగా తన రూపు మార్చుకోవడం ప్రారంభమైంది. ఐఐటీ, నీట్ వంటివి అసామాన్యమైన ప్రతిభ గల గ్రామీణ, తాలుకా స్థాయి పేద విద్యార్థులకు సైతం అందని ద్రాక్ష అయ్యింది. అందుకే పేద ధనిక సామాజిక సాంస్కృతిక సాంఘిక లింగ కుల మతం వంటి తదితర అంతరాలు లేకుండా అందరికీ సమానంగా “అంతర్జాతీయ స్థాయి విద్య”అందాలి. చదువు “కొనడం” పూర్తిగా మాయమై చదువుకునే అవకాశాలు గల్లీ నుంచి ఢిల్లీ దాకా అందరికీ సమానంగా ఉండాలి. అంతరిక్ష ప్రయోగాల కాలంలో మనం రాణించాలంటే మీరన్నట్లు ప్రపంచంతో పోటీపడాల్సిందే. ప్రైమరీ, హైస్కూల్, ఇంటర్ స్థాయి సిలబస్‌లు ఒకదానికొకటి సంబంధం ఉండాలి. సబ్జెక్ట్ నిపుణుల సాయంతో రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల కనుగుణంగా నూతన సిలబస్, బోధనా పద్ధతులను రూపొందించాలి. మనం అక్కడక్కడ వెలుగులోకి వస్తున్న ఫేక్ సర్టిఫికెట్‌లు కొనుక్కునే స్థాయి కాకుండా వంద ఏళ్ల చరిత్ర కలిగిన మన విశ్వ విద్యాలయాల్లో పి.హెచ్ డి, ఎం.ఎస్సీ, బి.ఎడ్ వంటి తదితర చదువులు చదివి నెట్, సెట్, టెట్ వంటి అర్హత పరీక్షల్లో పాసై, విద్యారంగం, బోధనపై ఆసక్తి వుండి కొన్ని కారణాల వల్ల ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉద్యోగం పొందని వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి విద్యాసంస్థలు నెలకొల్పేలా ప్రోత్సహించాలి. కేజీ నుంచి పీజీ వరకు బోధన, బోధనేతర ఖాళీలను ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ సాయంతో భర్తీ చేయాలి. బడ్జెట్‌లో విద్యకు 15% నిధులు కేటాయించాలి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కూడా సెమీ రెసిడెన్షియల్ విధానాన్ని అమలు చేస్తూ ఐఐటీ నీట్ ఫౌండేషన్ విద్యను కూడా ఒత్తిడి లేకుండా అందించగలిగితే విద్యను వ్యాపారం చేస్తున్న వ్యవస్థలను మనం నిర్మూలించవచ్చు. ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయ, అధ్యాపక పిల్లలు ప్రభుత్వ స్కూల్లో, కళాశాలల్లో చదివిస్తే ఆ తల్లిదండ్రులను గుర్తించి, వారి గురించి ఆదర్శప్రాయంగా మీడియాలో రాస్తున్నారంటే మన ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యావ్యవస్థపై లోతుగా విశ్లేషించాల్సిన అవసరం వుంది. ఆర్థికంగా లేని వాళ్లే ప్రభుత్వ బడిబాట అనే విధానంలో కచ్చితంగా మార్పు రావాలి. విద్య మనందరి ప్రాథమిక హక్కు. శారీరక, మానసిక దృఢత్వం కోసం ఆటలకు ప్రత్యేక సమయం కేటాయించాలి. మీరు తెలంగాణ క్రీడాకారులను ఒలింపిక్స్ పతకాలు తెచ్చేలా ప్రోత్సాహం అందిస్తామన్న తీరును స్వాగతిస్తున్నాం. దానికి పాఠశాలలే పునాది కావాలి. సివిల్స్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు మీరు అందించిన ఆర్థికసాయం అభినందించదగినది. దానివల్ల భవిష్యత్‌లో మన రాష్ట్రం నుంచి సివిల్స్‌కు పోటీపడే అభ్యర్థుల సంఖ్య పెరుగుతుంది. విశ్వవిద్యాలయాల స్థాయిలో పరిశోధనలు పెరిగేలా రిసెర్చ్ స్కాలర్స్‌కు కూడా స్కాలర్‌షిప్ అందించాలి. రసాయనాల కోసం ఆర్థిక సాయం అందించాలి. ఇంజనీరింగ్, మెడికల్ విద్యా వ్యవస్థలో నూతనత్వం కోసం నిపుణుల సలహాలు తీసుకోవాలి. మన పిల్లలకు నాణ్యతతో కూడిన, ఆందోళన లేని పరిసరాలతో స్నేహం చేసే శాస్త్రీయ విద్యను మనం అందించాలి. వివిధ రంగాల ప్రజల నుంచి, వివిధ రకాల విద్యాసదస్సులు, చర్చల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సీఎం రేవంత్ రెడ్డి విభిన్న ఆలోచనల సారాంశాన్ని సేకరించి ఓ మంచి విద్యావిధానంతో మన పిల్లలకు గొప్ప గొప్ప కలల భవిష్యత్తును నిజం చేయాలి.

# నక్కలగండి ప్రాజెక్టులో ముంపు గ్రామాల్లో నెల రోజుల్లో ఆర్ అండ్ ఆర్ ద్వారా ఇండ్ల నిర్మాణాలు చేపడతాం

-నక్కల గండి ప్రాజెక్టు నీటిలో నాటు పడవలో ప్రయాణించిన ఎమ్మెల్యే కలెక్టర్

-జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ లు





అచ్చంపేట, సెప్టెంబర్ 2:

నక్కలగండి ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న నక్కలగండి తండా, మర్లపాడు తండా, కేశ్య తండా, మన్నేవారి పల్లి గ్రామాల నిర్వాసితులకు రానున్న ఒక నెల రోజుల్లో ఆర్ అండర్ ఆర్ ప్యాకేజీ ద్వారా భూ సేకరణ చేసి ఇండ్లను నిర్మాణానికి అనుకూలమైన స్థలాన్ని ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణం చేపడతామని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ లు ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం అచ్చంపేట మండల పరిధిలోని మర్లపాడు తండా గ్రామాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఎమ్మెల్యే వంశీకృష్ణ తో కలిసి జెసిబి పై ప్రయాణించి గ్రామాన్ని సందర్శించి గ్రామ ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ముంపు గ్రామాల ప్రజల కోరిక మేరకు కల్వకుర్తి సమీపంలోని జెపి నగర్, తుక్కుగూడ, దేవరకొండ వచింతపల్లి వద్ద ప్రభుత్వ భూమిని గుర్తిస్తే ఎమ్మెల్యే గారితో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అక్కడ అందరికీ కావలసినంత ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకుంటే అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ వద్ద ఇదివరకే గురించిన స్థలంలో ఆర్ అండ్ ఆర్ ద్వారా పూర్తిస్థాయి నిర్మాణాలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ ముంపు గ్రామాల ప్రజలకు తెలిపారు. అదేవిధంగా మార్ల పాడు గ్రామ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు అయ్యేలా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో కృషి చేస్తుందన్నారు. గ్రామంలో రేషన్ కార్డులు లేని వాళ్లకు రేషన్ కార్డులను జారీకి తొందర్లోనే పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామన్నారు. రేషన్ ద్వారా అందించే సరుకులను గ్రామంలోని పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక్కడే నివాసముంటు భూముల్లో సాగు చేస్తూ ప్రస్తుతం ముంపు ద్వారా నష్టం వాటిల్లిన పంటల వివరాలను సైతం రాష్ట్ర వ్యవనష్టపరిహాన్ని కార్యదర్శి కి నివేదించి అందుకు కావలసిన నష్టపరిహాన్ని గ్రామ ప్రజలకు అందేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఆర్ అండ్ ఆర్ క్రింద ఇండ్ల నిర్మాణంతోపాటు అన్ని వసతులతో కాలనీ ని నిర్మించి అందించేందుకు పూర్తిస్థాయిగా చర్యలు తీసుకుంటామని, కలెక్టర్ తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ%%.. రానున్న ఒక మాసం రోజుల్లోనే అనువైన స్థలంలో ఆర్ అండ్ ఆర్ ద్వారా అన్ని వసతులతో కూడిన ఇండ్లను నిర్మించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క లతో మాట్లాడి వెంటనే అమలు అయ్యేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే నిర్వాసిత గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చారు. ముంపు గ్రామాల ప్రజలకు నచ్చిన గ్రామాల్లో స్థల సేకరణ కోసం ముంపు గ్రామాల ప్రజల కోరిక మేరకే ఐదు మందితో కమిటీ వేసి స్థల సేకరణ కోసం ప్రత్యేకంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముంపు గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపినారు. హాజీపూర్ దగ్గర ఇదివరకే స్థలాన్ని సేకరించడం జరిగిందని, మీకు కావాల్సిన ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంటే ముఖ్యమంత్రితో మాట్లాడి అక్కడే ఇండ్ల నిర్మాణానికి అందుకు కావలసిన చర్యలను జిల్లా కలెక్టర్ తో కలిసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం పంపు గ్రామాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేదని ఆయన తెలిపారు. ఇప్పటి ప్రభుత్వం ముంపు గ్రామాల ప్రజలకు శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వంతో మాట్లాడి రానున్న ఒక నెలలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులకు లబ్ధిదారులుగా అవకాశం కల్పించేందుకు ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు నక్కల గండి ప్రాజెక్టు నీటిలో నాటు పడవలో ఎమ్మెల్యే కలెక్టర్ అధికారులు గ్రామ ప్రజలతో కలిసి నక్కల గండి ప్రాజెక్టు ముంపు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం మన్నె వారి పల్లి గ్రామ సమీపంలో దేవరకొండ చిన్నంపేట మన్నె వారి పల్లి గ్రామాల రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభి నదిని కలెక్టర్ పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి కావలసిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముంపు గ్రామాల ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా అందుకు స్పందించిన కలెక్టర్ త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చందాపూర్ వద్ద చంద్ర సాగర్ వాగు ప్రవాహాన్ని బ్రిడ్జి పైనుంచి ఎమ్మెల్యే, కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ మాధవి, అచ్చంపేట డిఎస్పి శ్రీనివాస్, అచ్చంపేట తహసిల్దార్ మురళీమోహన్, అచ్చంపేట సీఐ రవీందర్, వివిధ శాఖల అధికారులు ముంపు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి- ఎంపి డీకే అరుణ

మద్దూర్ సెప్టెంబర్ 2: నారాయణ పేట ఉమ్మడి మద్దూర్ మండలం లోని ఎక్కమేడు గ్రామంలో రెండు రోజుల క్రితం భారీ వర్షాలకు మట్టి మిద్దె కూలి మృతి చెందిన హన్మమ్మ కుటుంబాన్ని, పరామర్శించిబాధిత కుటుంబం సభ్యులతో మాట్లాడి అన్ని రకాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చిన అరుణమ్మ. బాధితులకు ఒక్కొక్కరోకి 4 లక్షల చొప్పున కేంద్రం తరపున డిజస్టర్ మేనేజ్మెంట్ అందించే ఎక్స్ గ్రేసియా త్వరగా అందేలా అధికారులతో మాట్లాడారు. బాధితులకు త్వరగా పరిహారంతో పాటు నిత్యావసరం సరుకులు అందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ప్రమాదకర స్థితిలో ఉన్నా ఇళ్లను గుర్తించి బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున 5 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు ఘటన పై పంచనామా నిర్వహించి త్వరగా పరిహారం అందేలా చూడాలని కలెక్టర్, తహసీల్దార్ లతో ఫోన్లో మాట్లాడి ఆదేశించారు. ఇలాంటి ఘటన జరగడం బాధాకరం అన్నారు. మున్ముందు ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు సర్వే చేయించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగురావు నామాజి, ప్రతాప్ రెడ్డి, కేశవ రెడ్డి, నారాయణ రెడ్డి సుధాకర్ రెడ్డి రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరంలో భారీ వర్షపాతం

- గన్నేరువరం కరీంనగర్ ప్రధాన రహదారులపై భారీగా వరద నీరు చేరడంతో గన్నేరువరం
- మత్తడి వద్ద రహదారి మూసివేశారు



తెలంగాణ క్యాపిటల్ న్యూస్ గన్నేరువరం: మండల వ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో వరద నీరు చెరువుకుంటలోకి చేరడంతో పారువెల్ల కాసింపేట గునుకుల కొండాపూర్ గుండ్లపల్లి గ్రామాల్లోని చెరువులు కుంటలు అలుగు పారుతున్నాయి. గన్నేరువరం నుంచి కరీంనగర్, గుండ్లపల్లి నుంచి కరీంనగర్ వెళ్లే ప్రధాన రహదారిపై వరద నీరు చేరుకోవడంతో రాకపోకలు స్తంభించాయి. కునుకుల కొండాపూర్ లో ఇండ్లలోకి వరద నీరు చేరుకుంది. వివిధ గ్రామాల్లో వరదనీరుతో పంటలకు అపార నష్టం వాటిల్లింది.



## నీటి కొరత సమస్యను త్వరితగతిన పరిష్కరించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు



హైదరాబాద్ కూకట్ పల్లి, జోన్ ఇంచార్జ మధు, -సెప్టెంబర్ 02

బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇంద్రనగర్ బస్తి వాసుల నీటి కష్టాలను తీర్చేందుకు గత నెల ఆగస్టు 30'వ తేదిన ఇంద్రానగర్ సంక్షేమ సంఘం వారి కోరిక మేరకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఇంద్రనగర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో వాటర్ బోర్ వేయించారు, సమస్యపై వెంటనే స్పందించి నిర్ణయం తీసుకున్నందుకు అలాగే వాటర్ బోర్ విజయవంతం అవడంతో ఇంద్రనగర్ బస్తీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ వడ్డేపల్లి రాజేశ్వరరావు ఇంటికి వచ్చి ధన్యవాదాలు తెలియజేసి సన్మానించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ పదవిలో ఉన్న లేకున్నా, అధికారంలో ఉన్న లేకున్నా ప్రజా సేవే లక్ష్యంగా స్వర్గీయ వడ్డేపల్లి నర్సింగ్ రావు ఆశయ సాధనకై పనిచేస్తా అని తెలియజేశారు, అలాగే ఇంద్ర నగర్ బస్తీ వాసులో మరికొన్ని సమస్యలను నా దృష్టికి తీసుకురావడం జరిగింది వాటిని కూడ తొందరలోనే పరిష్కరిస్తానని బస్తివాసులకు భరోసా ఇచ్చారు, ఈ కార్యక్రమంలో ఇంద్ర నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు గిరి సాగర్, ప్రధాన కార్యదర్శి ఎం.అర్జున్, కోశాధికారి రాజు, సభ్యులు రవి సాగర్, నాగరాజు, అనిల్, విజయ్, మరియు బస్తివాసులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు

-జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్, ఐపీఎస్



వనపర్తి సెప్టెంబర్ 2:

వనపర్తి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల (సెప్టెంబర్ 1వ తేది నుండి 30 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపినారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని అన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి. సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణ కు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని అన్నారు.

## బీసీలం బుద్ధుడి వారసులం

- సైంటిస్ట్ శ్రీధర్




ముంబై, సెప్టెంబర్ 2:

తెలంగాణ యువ శాస్త్రవేత్త, బహుజన నాయకులు డాక్టర్ బట్టు శ్రీధర్ గంగపుత్ర గారు నాలెడ్జి ఆఫ్ సింబల్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ నివాసమైన రాజగృహ, ఆయన సమాధిఐన చైత్యభూమి లను ఆదివారం సందర్శించారు. ముంబైకి విచ్చేసిన ఆతిథికి గంగపుత్ర సమాజ్ నేత కాశవేణి చంద్రన్న బెస్త, ప్రఖ్యాత తెలుగు కార్మిక నేత సిరిపంగి రవీందర్ చేతుల మీదుగా నీలి కండువా, పంచశీల జెండాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బాంసేఫ్ (ఉద్యోగుల విశ్వ సంస్థ), భారత విద్యార్థి మోర్చా రాష్ట్ర నాయకులు బట్టు శ్రీధర్ మాట్లాడుతూ తాను ఈ రోజు ఓ ఉన్నత వ్యక్తిగా ఎదగడానికి ఏకైక మూల కారణం కేవలం బుద్ధుడు పూలే పెరియార్ అంబేద్కర్ల సిద్ధాంతం పోరాటాల ఫలితమే అన్నారు. ఈ బహుజన మహనీయులు లేకుంటే భారత దేశంలో తమ 52%గల ఓబీసీ వర్గానికి పుట్టగతులు లేవని తేల్చిచెప్పారు. గౌతమ బుద్ధుడి తల్లీ మహామాయ తమ జాతి గంగపుత్ర (బెస్త, కోళి) సామాజిక వర్గానికి చెందిన విషయాన్ని గుర్తు చేస్తూ, తాను మానవీయ బౌద్ధ ధర్మాన్ని ఆచరించే సచ్చా కార్యకర్తనని “రాజగృహ” సాక్షిగా సగౌరవంగా తెలియజేశారు. సమస్త బీసీలు అన్ని రంగాల్లో సకల అభివృద్ధి చెందాలంటే మహారాష్ట్రలో బ్రాహ్మణుల అనంతరం ఉన్నత స్థాయికి ఎదిగిన “మహర్ బుద్ధిస్టులు” తనకు ఆదర్శమని, దానినే మన ఓబీసీ సోదరులు ఆదర్శంగా తీసుకోవాలని శాస్త్రవేత్త శ్రీధర్ విజ్ఞప్తి చేశారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో ప్రసిద్ధ కార్మిక నేత చౌవల్ రమేష్ మాలజీ, కొరగోని ప్రభు మహారాజ్, ముంబై ముదిరాజ్ సీనియర్ నాయకులు తడవేని సాయన్న ముదిరాజ్, గాయకులు భీంరత్న మాలజీ, మూల్ నివాసి మాలజీ పాల్గొన్నారు.

# క్లారిటీ ఇచ్చిన అదితిరావు హైదరీ!



గత మార్చిలో హీరో సిద్ధార్థ్, హీరోయిన్ అదితిరావు హైదరీలు సీక్రెట్‌గా ఎంగేజ్మెంట్ చేసుకున్న విషయం తెలిసిందే. వనపర్తి జిల్లా శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి ఆలయంలో వీరి నిశ్చితార్థ వేడుక జరిగింది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో అదితి పాల్గొనగా.. ఎప్పుడు పెళ్లి చేసుకుంటారనే ప్రశ్న ఎదురైంది. ఇందుకు సిద్ధార్థ్‌తో ప్రేమ, పెళ్లి గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. రంగనాథస్వామి ఆలయంలోనే తామిద్దరం పెళ్లి చేసుకుంటామని అదితి చెప్పారు. 'మహాసముద్రం సినిమా షూటింగ్ సమయంలోనే సిద్ధార్థ్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయమే క్రమంగా ప్రేమగా మారింది. మా నాన్నమ్మ అంటే చాలా ఇష్టం.


మాకు హైదరాబాద్‌లో ఓ స్కూల్ ఉంది. నేను చిన్నతనంలో ఎప్పుడు అక్కడే ఉండేదాన్ని. ఆ స్కూల్ అంటే చాలా ఇష్టం. కొన్నాళ్ల క్రితం మా నానమ్మ కన్నుమూశారు. ఓ రోజు సిద్దార్థ్ నన్ను ఆ స్కూల్‌కు తీసుకెళ్లాడు. అక్కడ మోకాళ్లపై కూర్చొని నాకు ప్రపోజ్ చేశాడు. సిద్దార్థ్ ప్రపోజ్ చేసిన తీరు ఎంతో నచ్చింది. నాన్నమ్మ ఆశీస్సులకోసమే అక్కడ ప్రపోజ్ చేశాడు' అని అదితిరావు హైదరీ చెప్పారు. 'శ్రీరంగాపురంలోని రంగనాథస్వామి ఆలయంతో మా కుటుంబానికి ఎంతో అనుబంధం ఉంది. అందుకే అక్కడే సిద్దార్థ్, నేను నిశ్చితార్థం చేసుకున్నాం.

## హీరోయిన్ సంచలన వ్యాఖ్యలు!



మలయాళ చిత్ర పరిశ్రమలో నటీమణులు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితుల గురించి 'జస్టిస్ హేమ కమిటీ' ఓ నివేదిక సిద్ధం చేసిన విషయం తెలిసిందే. హేమ కమిటీ రూపొందించిన రిపోర్టులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇండస్ట్రీకి చెందిన కొందరు ప్రముఖులు.. నటీమణులను ఓ ఆటబొమ్మలా చూస్తారని పేర్కొంది. హేమ కమిటీ రిపోర్ట్ అనంతరం చాలా మంది నటీమణులు తమపై జరిగిన లైంగిక వేధింపుల గురించి మాట్లాడటం మొదలుపెట్టారు. ప్రస్తుతం భారతీయ సినిమా మొత్తం దీని గురించే మాట్లాడుకుంటుంది. హేమ కమిటీ నివేదిక తీవ్ర దుమారం కొనసాగుతున్న వేళ ప్రముఖ నటుడు, మెగాస్టార్ మోహన్‌లాల్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అసోసియేషన్ ఆఫ్ మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ (అమ్మ) అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయనతో పాటు 17 మంది సభ్యులు రాజీనామా చేశారు. ఈ మూకుమ్మడి రాజీనామాల నిర్ణయంపై హీరోయిన్ పార్వతి స్పందించారు. ఈ విషయాన్ని మీడియాకు వివరించే స్థితిలో ఉన్న మోహన్‌లాల్ వైదొలగడం ఎంత పిరికితనం అని విమర్శించారు. అమ్మ అధ్యక్ష పదవికి రాజీనామా చేయడం పిరికిపంద చర్య అని పేర్కొన్నారు. ఓ ఇంటర్వ్యూలో పార్వతి మాట్లాడుతూ%ూ% 'ఈ వార్త వినగానే నేను ముందుగా షాక్ అయ్యా. ఇది ఎంత పిరికితనం. విషయాన్ని మీడియాకు వివరించే స్థితిలో ఉన్న వాళ్లు తమ బాధ్యతల నుంచి వైదొలగడం పిరికితనమే. రాజీనామా చేయకుండా ప్రభుత్వంతో కలిసి పని చేస్తే అద్భుతంగా ఉండేది. నేను గతంలో అమ్మలో భాగమే. వారు ఎలా పని చేస్తారో నేను చూశాను. నేను అసోసియేషన్‌కు రాజీనామా చేయడానికి ఒక కారణం ఉంది.

## ప్రశాంత్ వర్మ సినిమాలో బాలయ్య...



బాలకృష్ణ వారసుడు మోక్షజ్ఞ తేజ తెరంగేట్రం ఇదిగో అదిగో అంటూ గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. కానీ వారసుడి ఎంట్రీ మాత్రం జరగడం లేదు.అయితే ఈసారి మాత్రం ఎంట్రీ పక్కా అన్నట్లే సౌండ్ వినిపిస్తుంది. కాగా బాలయ్య తన వారసుడిని ఆడియన్స్ కి పవర్ ఫుల్ గా పరిచయం చేసే భాద్యతని యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మకి అప్పజెప్పినట్లు చెబుతున్నారు. ఆల్రెడీ స్టోరీ కూడా ఫైనల్ అయ్యిందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నట్లు సమాచారం.కాగా ఈ సినిమాలో కేవలం వారసుడు మాత్రమే కాదట, బాలయ్య కూడా కనిపించబోతున్నారట.

## రాజకీయాల్లోకి వస్తా....



చిత్రసీమకు రాజకీయ రంగానికి దగ్గరి సంబంధం ఉన్న సంగతి తెలిసిందే. చిత్రసీమలో రాణించిన చాలామంది రాజకీయాల్లోకి అడుగుపెట్టి సక్సెస్ అయినా వారు ఉన్నారు..అలాగే ప్లాప్ అయినవారు ఉన్నారు.

కొంతమంది మాత్రం ఎన్ని అపజయాలు వచ్చిన ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకొని విజయం సాధించే వరకు కష్టపడ్డారు. అలాంటి వారిలో పవన్ కళ్యాణ్ ను ఉదాహరణ గా చెప్పుకోవచ్చు. తన అన్న ప్రజారాజ్యం పార్టీ పెట్టి మొదటి విడతలోనే విజయం సాధించినప్పటికీ..రాజకీయాల్లో ఎక్కువగా కాలం ఉండలేక..కాంగ్రెస్ లో ప్రజారాజ్యాన్ని విలీనం చేసి, మళ్లీ సినిమాల్లోకి వచ్చారు. కానీ పవన్ కళ్యాణ్ మాత్రం సినిమాలు , రాజకీయాలు రెండు చూసుకుంటూ సక్సెస్ అయ్యారు. ప్రస్తుతం ఏపీ డిప్యూటీ సీఎం గా బాధ్యతలు చేపట్టారు. ఇక పవన్ కళ్యాణ్ ను ఉదాహరణ గా తీసుకోని చాలామంది సినీ ప్రముఖులు రాజకీయాల్లోకి రావాలని చూస్తున్నారు. ముఖ్యంగా తమిళనాట వరుసగా హీరోలు తమ రాజకీయ ప్రవేశం గురించి ప్రకటిస్తూ వస్తున్నారు. ఇప్పటికే కమల్ హాసన్ , విజయ్ వంటి వారు రాజకీయాల్లోకి అడుగుపెట్టగా..ఇక విశాల్ కూడా రాజకీయాల్లోకి వచ్చేందుకు సై అంటున్నాడు. తాజాగా ఆయన మాట్లాడుతూ..

అన్ని పనులు పక్కన పెట్టేసి రాజకీయాల్లోకి వస్తే బాగుంటుందనిపిస్తోందని, త్వరలోనే రాజకీయాల్లోకి వస్తానని, ప్రజాసేవ చేస్తానని విశాల్ తెలిపారు. విషయం ఏదైనా సరే తాను నిజయతీగా మాట్లాడతానని, తన మాదిరి అందరూ ఉండలేరని చెప్పుకొచ్చారు. తనకు చాలా సింపుల్ గా ఉండటమే ఇష్టమని, ఆడంబరంగా బతకడం తనకు ఇష్టం ఉండదని అన్నారు.

## నష్టపరిహారం డిమాండ్ చేసిన నటి..!



బాలీవుడ్ నటి రిమీ సేన్ రూ. 50 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని లగ్జరీ కార్ల తయారీ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్‌కు లీగల్ నోటీసు పంపింది.

తన కారులో చాలా సాంకేతిక లోపాలు ఉన్నాయని ఫిర్యాదు చేసినప్పటికీ డీలర్‌షిప్ వద్ద తన ఫిర్యాదును పరిష్కరించలేదని నటి ఆరోపించింది. రిమి సేన్ 2020 సంవత్సరంలో రూ. 92 లక్షల విలువైన ల్యాండ్ రోవర్ వేరియంట్‌ను కొనుగోలు చేసింది. నటి ఫిర్యాదు ప్రకారం.. ఆమె ఈ పెద్ద సైజు లగ్జరీ కారును కంపెనీ అధీకృత డీలర్ అయిన సతీష్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి కొనుగోలు చేసింది.

కోవిడ్ సమయంలో లాక్డౌన్ కారణంగా కారు చాలా తక్కువగా నడిచిందని పేర్కొన్నారు. అయితే ఆమె కారులో కొన్ని కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత సన్‌రూఫ్ నుండి శబ్దం రావడం ప్రారంభమైంది. కారు సౌండ్ సిస్టమ్, వెనుక కెమెరా పనిచేయలేదు. దీనిపై ఆమె 2022 ఆగస్టు 25న డీలర్‌షిప్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.


## ఈసారి రెట్టింపు వినోదంతో 'మత్తు వదలరా 2'...



'మత్తు వదలరా' సినిమాతో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు దర్శకుడు రితేశ్ రానా. ఇప్పుడాయన దీనికి కొనసాగింపుగా 'మత్తు వదలరా 2'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. శ్రీసింహా కోడూరి, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చెర్రీ, హేమలత సంయుక్తంగా నిర్మించారు.

సత్య, వెన్నెల కిశోర్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా సెప్టెంబరు 13న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం హైదరాబాద్‌లో టీజర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో శ్రీసింహా మాట్లాడుతూ.. "మత్తు వదలరా'ని ప్రేక్షకులు పెద్ద హిట్ చేశారు. కొంతమంది దాన్ని థియేటర్స్‌లో చూడలేకపోయామని మెసేజ్‌లు చేశారు.వాళ్లందరికీ రెండు రెట్ల వినోదాన్ని.. థ్రిల్‌ను రుచి చూపించేలా ఈ రెండో భాగాన్ని సిద్ధం చేశాం.

## నటిగా ఉండడం ఇష్టం లేదు



నటిగానే కొనసాగడం తనకు నచ్చదు అని బాలీవుడ్ నటి కంగనా రనౌత్ చెప్పారు. నటీనటులుగా ఉండటం ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో తెలిసిన మంచి దర్శకుల్లో తానూ ఒకరినన్నారు.దర్శకురాలిగా ఉండటం ఎంతో ఇష్టం అని చెప్పుకొచ్చారు. ఓ సమయంలో ఆఫర్స్ లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నానని, దేశం విడిచి విదేశాలకు వెళ్లిపోవాలనుకున్నా అని కంగనా తెలిపారు. కంగనా నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. సెప్టెంబర్ 6న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన కెరీర్ గురించి చెప్పారు. 'నటిని కావాలనే ఆశతో 2004లో ముంబైకి వచ్చా. ఆరంభంలో గ్యాంగ్‌స్టర్, వోహ లమ్హే వంటి చిత్రాల్లో నటించాను. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన సూపర్ మోడల్, గ్యాంగ్‌స్టర్ వంటి ఎన్నో పాత్రలు చేశాను. నా నటనకు ఎన్నో ప్రశంసలు దక్కాయి. కంగనా నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. సెప్టెంబర్ 6న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన కెరీర్ గురించి చెప్పారు. 'నటిని కావాలనే ఆశతో 2004లో ముంబైకి వచ్చా. అయితే దాదాపు దశాబ్దకాలం పాటు నాకు అవకాశాలు రాలేదు. ఆఫర్స్ లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా. దేశం వదిలి వెళ్లిపోవాలనుకున్నా' అని కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి కంగనా రనౌత్ చెప్పారు. నటిగా కంటే దర్శకురాలిగానే తనకు వర్క్ చేయడం బాగుంటుందని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు కంగనా సమాధానం ఇచ్చారు. 'నటిగా వర్క్ చేయడం నాకు పెద్ద కష్టం కాదు. నటిగానే కొనసాగడం నాకు నచ్చదు. అందుకు పలు కారణాలు ఉన్నాయి. ఓ నటిగా చెప్పాలంటే.. సెట్‌కు సంబంధించి పూర్తి సమాచారం మన వద్ద ఉండదు. దర్శకురాలిగా ఉండటం ఇష్టం. సెట్‌లో ఏం జరుగుతుంది? అన్నది నేను చెప్పగలను.

## ఇప్పటికీ ఆమే నాకు స్ఫూర్తి....!



'క్రూ'తో ఇటీవలే ప్రేక్షకులను పలకరించిన అందాల తార కృతి సనన్.. త్వరలో 'దో పత్తీ'తో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. మిస్టరీ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో సీనియర్ కథానాయిక కాజోల్‌తో కలిసి నటించనుంది కృతి.ఈ సినిమాతోనే ఆమె నిర్మాతగానూ మారడం మరో విశేషం. ఈ సందర్భంగా కాజోల్‌తో కలిసి నటించిన 'దిల్‌వాలే' సినిమా రోజుల్ని గుర్తు చేసుకుంటూ కొన్ని ఆసక్తికర విషయాలను పంచుకుంది కృతి.